క్లుప్తంగా

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఆర్డీఓ



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి సన్నిధిలో ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని కొత్తపేట ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించే ముందు జీవీవీ సత్యనారాయణ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్డీఓ సత్యనారాయణకు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆర్డీఓ సత్యనారాయణను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



నల్లచెరువు వేంకటేశ్వరస్వామి

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి ఇచ్చారు. వేదపండితుల స్వామికి తులసి పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం చేశారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామిని ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన



మామిడికుదురులో నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

మామిడికుదురు: విశాఖపట్నం జిల్లాలో తహసీల్దార్ ఎస్.రమణయ్య హత్యను ఖండిస్తూ రెవెన్యూ ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తహసీల్దార్ హత్య అతి కిరాతకమని ఆందోళన వ్యక్తం చేశారు. భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. హత్యకు పాల్పడిన ఆగంతకులను వెంటనే అరెస్టు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. జిల్లా ఏపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దేవళ్ల శ్రీనివాస్‌తో పాటు ఉద్యోగులు ఈ నిరసనలో పాల్గొన్నారు.

కుష్ఠు రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ



విలస న్యూలైఫ్ సెంటర్‌లో కుష్ఠు రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి భారతలక్ష్మి

అయినవిల్లి: స్పార్చ్ ప్రోగ్రామ్‌లో భాగంగా విలస న్యూలైఫ్ సెంటర్‌ను జిల్లా కుష్ఠు రోగుల అధికారి, అదనపు జిల్లా వైద్యాధికారి భారతలక్ష్మి శనివారం సందర్శించారు. కుష్ఠు రోగులను పరీక్షించి వారికి దుప్పట్లు, పండ్లు, రొట్టెలు, పాదరక్షలు పంపిణీ చేశారు. వ్యాధి లక్షణాలను కుష్ఠు రోగులకు వివరించారు. మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.మంగాదేవి, సీహెచ్ఓ జీవీఎస్ రాంబాబు, పీహెచ్ఎన్ సీతారామమ్మ, సూపర్‌వైజర్ పి.ప్రసాదరావు, మెహర్‌వాణి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అద్వానీకి భారతరత్నపై హర్షం

రాజోలు: బీజేపీ నాయకుడు ఎల్‌కే అద్వానీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. శనివారం ఆయన రాజోలులో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ వ్యవస్థాపకుల్లో ఒకరుగా, ఆర్ఎస్ఎస్‌లో కీలక భూమిక పోషించిన అద్వానీకి భారతరత్న ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. 2015లో ఆయనకు భారతదేశ రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ వచ్చిందన్నారు.



దిండిలో ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు



పి.గన్నవరంలో బస్సులు, కార్ల ర్యాలీని ప్రారంభిస్తున్న పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి



సిద్ధం సభకు వెళుతున్న వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



అయినవిల్లిలో బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు

ఉత్సాహంగా సిద్ధం సభకు పయనం

- దెందులూరు సభకు తరలివెళ్లిన పార్టీ శ్రేణులు
- జెండా ఊపి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక
- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో 105 బస్సులు, 130 కార్లలో సిద్ధం సభకు పయనం



రావులపాలెంలో సిద్ధం సభకు బయలుదేరుతున్న వాహన శ్రేణికి జెండా ఊపుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు సిద్ధం సభకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సూచనల మేరకు మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుంచి బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

రావులపాలెం: దెందులూరులో నిర్వహిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు శనివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జనసంద్రంలా కదలివెళ్లారు. రావులపాలెం మండలం మల్లాయిదొడ్డి వద్ద గ్రౌండ్‌కు నియోజకవర్గంలోని శ్రేణులు చేరుకుని అక్కడ నుంచి దెందులూరుకు పయనమయ్యారు. నియోజకవర్గం నలుమూలల నుంచి 105 బస్సులు, 130 కార్లలో సుమారు 6000 మంది వైఎస్సార్ సీపీ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఏలూరు సిద్ధం సభకు తరలివెళ్లారు. ఈ వాహన శ్రేణికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 2024లో తిరిగి వైఎస్సార్ సీపీని గెలిపించుకునే లక్ష్యంగా సిద్ధం సభకు కొత్తపేట నియోజవకవర్గం నుంచి భారీగా తరలివచ్చి పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. జగ్గిరెడ్డి వెంట ఎంపీపీలు మార్గన గంగాధరరావు, కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీలు కె.శ్రీనివాసరావు, జి.రమాదేవి, బోణం సాయిబాబా, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, వైస్ ఎంపీపీలు బొక్కా ప్రసాద్, గన్నవరపు వెంకట్రావు, సర్పంచులు తాడేపల్లి నాగమణి, కర్రి గోవిందకృష్ణారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

మలికిపురం: దెందులూరులో శనివారం జరిగిన వైఎస్సార్ సీపీ సిద్ధం సభకు భారీ ఎత్తున పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సారథ్యంలో వేలాది మంది పార్టీ నాయకులు బస్సుల్లో వెళ్లారు. అన్ని గ్రామాల నుంచి దిండి చేరుకున్న బస్సుల ర్యాలీకి ఎమ్మెల్యే రాపాక జెండా ఊపి ప్రారంభించారు. జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, దొండపాటి అన్నపూర్ణ, మట్టా శైలజ, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీరబ్రహ్మాజీ, కేఎస్ఎన్ రాజు, గెడ్డం తులసీ భాస్కరరావు, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన్న రాజా, ముత్యాల కాశి, చింతా రాజబాబు పాల్గొన్నారు.

మామిడికుదురు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో దెందులూరులో జరిగిన సిద్ధం ఎన్నికల శంఖారావం సభకు మామిడికుదురు మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. పి.గన్నవరం నియోజకవర్గం పరిధిలోని 11 గ్రామాలు, రాజోలు నియోజకవర్గంలోని ఏడు గ్రామాల నుంచి 18 బస్సులు, ఇతర వాహనాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు తరలి వెళ్లారు. జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆధ్వర్యంలో సిద్ధం సభకు పయనమయ్యారని పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రావు, బొలిశెట్టి భగవాన్, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు తెలిపారు.

విప్పర్తి ఆధ్వర్యంలో..

పి.గన్నవరం: దెందులూరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన 'ఎన్నికల శంఖారావం సిద్ధం' సభకు నియోజకవర్గం నుంచి పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. బస్సులు, కార్ల ర్యాలీని స్థానిక మూడు రోడ్ల సెంటర్లో విప్పర్తి జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం 50 బస్సులు, 100కు పైగా కార్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తరలివెళ్లారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సిద్ధం సభకు తరలివెళ్లిన పార్టీ శ్రేణులకు విప్పర్తి అన్ని ఏర్పాట్లు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకటశివరామన్, పితాని నర్సింహారావు, యన్నాబత్తుల ఆనంద్, సాధనాల రమేష్, యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, కొక్కిరి రవి కుమార్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు దెందులూరుకు తరలివెళ్లారు.

అంబాజీపేట: దెందులూరులో శనివారం జరిగిన సిద్ధం బహిరంగ సభకు మేమూ సిద్ధమే అంటూ మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ పేదల పెన్నిధి సీఎం జగన్ తండ్రి నడకలో అడుగు వేసి, ప్రజలకు బంగారు బాట చూపిస్తున్నారన్నారు. సిద్ధం కార్యక్రమానికి సుమారు 60 బస్సుల్లో తరలివెళ్లిన ర్యాలీకి ఎంపీపీ, జెడ్పీటీసీలు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, కొర్లపాటి కోటబాబు, విత్తనాల శేఖర్, నాగవరపు నాగరాజు, మట్టపర్తి హరి, అప్పన శ్రీను తదితరులు తరలివెళ్లారు.

అయినవిల్లి: మండలం నుంచి దెందులూరులో జరిగిన సిద్ధం కార్యక్రమానికి 14 బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు శనివారం తరలివెళ్లారు. వీరిలో వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండల కన్వీనర్ కుడుపూడి విద్యాసాగర్, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు.

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సిద్ధం సభకు శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పయనమయ్యారు. పొదలాడ సెంటర్ నుంచి పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, కంబాల చంద్రరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. అలాగే రాజోలు, తాటిపాక, సోంపల్లి, కడలి, చింతలపల్లి, శివకోడు కూనవరం, ములికిపల్లి గ్రామాల నుంచి ప్రత్యేక బస్సుల్లో దెందులూరు సభకు వెళ్లారు.

ఆత్రేయపురం: మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీ ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు దెందులూరులో నిర్వహించిన సిద్ధం సభకు భారీ ఎత్తున తరలివెళ్లారు.



పొదలాడ సెంటర్ నుంచి బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



మామిడికుదురు మండలం నుంచి సిద్ధం సభకు వెళ్లిన పార్టీ శ్రేణులు



చెముడులంక నుంచి సభకు తరలివెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

'ఉపాధి'లో అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అంబుడ్స్‌మన్ జ్యోతి

మామిడికుదురు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అక్రమలు జరిగితే ఫిర్యాదు చేయాలని అంబుడ్స్‌మన్ ఎం.జ్యోతి అన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సభ జరిగింది. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు మండల పరిధిలో చేపట్టిన పనులపై డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ సమీక్షించారు. ఉపాధి హామీ ద్వారా 888 పనులను నిర్వహించారన్నారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి 28 పనులు చేపట్టామని చెప్పారు. ఉపాధి హామీకి సంబంధించి కూలీల వేతనాలు, మెటీరియల్‌కు సంబంధించి రూ.3.42 కోట్లు చెల్లించారని చెప్పారు. పీఆర్‌కు సంబంధించి రూ.2.06 కోట్లు చెల్లించామన్నారు. పీఆర్ పనుల్లో రూ.3.20 లక్షలు తేడాలు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి రూ.70 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులకు సంబంధించి రూ.20 వేలు రికవరీ చేశారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి కె.భీమేశ్వర్, ఏపీఓ రమేష్‌బాబు, ఏఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'ను విజయవంతం చేయాలి



కొత్తపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథరాజు

కొత్తపేట: దేశ వ్యాప్తంగా బీజేపీ తలపెట్టిన 'పల్లెకు పోదాం' (గావ్ చలో అభియాన్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఇన్‌చార్జ్ సాగి కాశీవిశ్వనాథరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బ్రాహ్మణ కల్యాణ మండపంలో నియోజకవర్గ బీజేపీ సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అయినవెల్లి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానవర్గం నిర్దేశించిన మేరకు ఇప్పటికే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారని పేర్కొంటూ పార్టీ శ్రేణులను అభినందించారు. అలాగే ఈ నెల 9, 10, 11 తేదీల్లో దేశ వ్యాప్తంగా బీజేపీ తలపెట్టిన పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రతి ఇంటి గడపను సందర్శించి ఆయా కుటుంబాల వారికి కేంద్ర పథకాలు ఏయే రూపాల్లో అందాయో వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా ప్రతి బూత్ స్థాయిలో ఆంధ్రాలో ఒకసారి, కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్ అని వాల్ రైటింగ్ రాయించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందరావు, జిల్లా ఇన్‌చార్జ్ పాట్లూరి రామ్మోహనరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అయ్యాజీవేమా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, గుంటూరు ఇన్‌చార్జ్ తమలంపూడి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి జేపీ, మండల శాఖ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



మడికిలో ఆలయ నిర్మాణానికి విరాళాన్ని అందజేస్తున్న తమ్మన శ్రీనివాస్

ఆలమూరు: మండలంలోని మడికిలో ఆలయ నిర్మాణానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. ఇటీవల గ్రామంలో పర్యటన సందర్భంగా నాలుగో వార్డు మహిళలు తమ ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించుకునేందుకు సహాయ సహకారాలను అందించాలని విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సానుకూలంగా స్పందించారు.

తమ వంతు సాయంగా ప్రకటించిన విరాళాన్ని శుక్రవారం సాయంకాలం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు స్వయంగా ఆ ప్రాంతానికి వెళ్లి అందజేశారు. అడిగిన వెంటనే ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి గ్రామ మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తపేట ఆర్డీవోగా సత్యనారాయణ



కొత్తపేట: కొత్తపేట ఆర్డీవోగా జీవీవీ సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన ఎం.ముక్కంటి ఏలూరు బదిలీ కాగా ఆయన స్థానంలో అక్కడ డిప్యూటీ కలెక్టర్ (కేఆర్ఆర్‌సీ) గా పనిచేసిన సత్యనారాయణ బదిలీపై వచ్చారు. ఆయనకు ఆర్డీవో కార్యాలయం అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డీటీలు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు.

గోమాతకు ప్రథమ వర్ధంతి



గుమ్మిలేరులో గోమాతకు ప్రథమ వర్ధంతి నిర్వహిస్తున్న రైతు సత్తిబాబు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో గోమాతకు ప్రథమ వర్ధంతి జరిగింది. గ్రామానికి చెందిన పశుపోషకుడు రెడ్డి సత్తిబాబు పశువుల మకాంలో ఇంట పుట్టిన ఆవు గత ఏడాది మృతి చెందింది. దీంతో రైతు సత్తిబాబు ఆ గోమాత పట్ల ఉన్న ప్రేమతో తమ ఇంట్లో కుటుంబసభ్యులకు జరిపించే విధంగానే అప్పట్లో అంత్యక్రియలు చేసి దశదిన కర్మ నిర్వహించారు. ఆ గోమాత మృతి చెంది ఏడాది కావడంతో రైతు సత్తిబాబు దంపతులు గోమాత సమాధి వద్ద శనివారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రథమ వర్ధంతి జరిపారు. అనంతరం పరిసర ప్రాంతవాసులకు అన్నసమారాధన నిర్వహించారు. ఇంట పుట్టిన గోమాతకు ఇటువంటి కార్యక్రమాలు చేయడంపై స్థానికంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు, రైతులు రెడ్డి జానకిరామయ్య, యార్లగడ్డ రమేష్ చౌదరి, గుణ్ణం శ్రీనివాస్, రెడ్డి చిట్టిబాబు, యార్లగడ్డ వీర్రాజు, వీరపనేడి బోసు, రెడ్డి నారాయణరావు, కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ డీఈకి ఘన సత్కారం



పీఆర్ డీఈ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ఉత్తమ డీఈ అవార్డు అందుకున్న పంచాయతీ రాజ్ పి.గన్నవరం డీఈ కె.చంద్రశేఖర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని జేఈలు, కార్యాలయ సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. వారు ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జేఈలు కడలి ఆనందబాబు, కె.కృష్ణంరాజు, విశ్రాంత సీనియర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నారాయణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, గోపాలస్వామి, ఉమా కమండలేశ్వరస్వామి, వాగ్దేవి నగరమహాలక్ష్మి, సమయవంతుల మాతంశెట్టి అన్నదాన సత్రాలకు సంబంధించి ధర్మకర్తల మండలి నియమాకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. 20 రోజుల కాలవ్యవధిలో ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఆయా ఆలయాల్లో సంప్రదించాలని కోరారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లిలో వేంచేసిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. దేవదాయ శాఖ ఏసీ, ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. తైలాభిషేకాల ద్వారా రూ.1,06,103, ఎంఒల ద్వారా రూ.3,828, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.36,958 దేవస్థానానికి ఆదాయం వచ్చినట్లు ఏసీఅండ్ఈఓ తెలిపారు.

సూపర్ చెక్‌లో సవరణలు చేసుకోవచ్చు

అంబాజీపేట: ఈ-పంట నమోదు ప్రక్రియలో సవరణలు ఉంటే రైతులు సూపర్‌చెక్ ద్వారా సరి చేసుకోవచ్చని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వక్కలంక, ఇరుసుమండ గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు సూపర్‌చెక్ కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఏడీఏ రామమోహనరావు మాట్లాడుతూ ఈ-క్రాప్ సూపర్ చెక్ ద్వారా చేర్పులు, మార్పులు ఉంటే వాటిని రైతులు సరిచేసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలో ఈ-క్రాప్ నమోదు వేగవంతంగా జరుగుతుందన్నారు. ఈ-క్రాప్ నమోదుపై రైతులు అలసత్వం వహించకుండా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ డి.దుర్గారావు, వీఏఏలు ఎన్.కిరణ్‌దుర్గ, బి.సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్‌పై సమీక్ష

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులపై శనివారం సమీక్ష జరిగింది. ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జేఈ పి.పద్మ అధ్యక్షత వహించగా ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్ పాల్గొని ప్రసంగించారు. గ్రామాల వారీగా జరిగిన అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. పైప్‌లైన్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు సురక్షిత తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

రావులపాలెం: మండలంలోని ఊబలంక షిరిడీ సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం బాబా వారిని గ్రామంలో పల్లకీపై ఊరేగించారు. ఊరేగింపులో డప్పు వాయిద్యాలు, శక్తి వేషాలు, కోలాటం, తదితర నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా భక్తులు బాబావారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముంగండలో రేపటి నుంచి రుగ్వేద మహాసభలు

పి.గన్నవరం: ముంగండలోని చింతామణి గణపతి మందిరంలో ఆశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి సంపూర్ణ రుగ్వేద సంహిత, బ్రాహ్మణ, అరణ్యక, ఉపనిషత్‌లు పారాయణ, వేద విద్వత్ మహాసభలు నిర్వహిస్తున్నట్టు పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోదావరి వెంకట సుబ్బారావు, చెరుకూరి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్‌లు తెలిపారు. మూడురోజుల పాటు జరిగే వేద సభల్లో రాష్ట్రం నలుమూలల నుంచి వేద విద్వాంసులు హాజరవుతారన్నారు. కార్యక్రమాల్లో వేద రక్షకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

6న చలో అసెంబ్లీని విజయవంతం చేయాలి

అంబాజీపేట: గ్రామ సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి 6న చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని ప్రతి సర్పంచ్ పాల్గొని విజయవంతం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి పిలుపునిచ్చారు. సర్పంచ్‌ల 16 డిమాండ్ల సాధనకై అసెంబ్లీ ముట్టడిస్తున్నట్లు శాంతకుమారి తెలిపారు. జిల్లాలోని సర్పంచ్‌లు పార్టీలకు అతీతంగా పాల్గొనాలని కోరారు.

సాంకేతిక శిక్షణతో ఉపాధ్యాయులకు ఎంతో మేలు



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న సుబ్రహ్మణ్యం

రాజోలు: ఉపాధ్యాయులకు సాంకేతిక శిక్షణ ఎంతో మేలు చేస్తుందని కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బోరుసు సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు గణితం, సైన్స్ బోధించే ఉపాధ్యాయులకు ఐసీటీ సిమ్యులేషన్ శిక్షణ తరగతులను నిర్వహించారు. మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారని ఎంఈఓ మనోహరం తెలిపారు. సైన్స్, గణితం సబ్జెక్టుల్లో సాంకేతిక శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.